కవితా కౌముది

# ప్రేమది మౌనమే

సుభాషిణి వడ్డెబోయిన

ఆమె ఎవరో
అతడికి తెలియకుండానే
అతని మనసుకు తెలుసు

ఒక్కో మాట
ఒక్కో ఊహగా
రంగురంగులుగా అల్లుకుంటూ

బరువెక్కుతూ కాలం
ఇద్దరినీ  ఒక్కటిగా చేసి
ప్రేమగా మొలిచి

ఆమె మనసు ఆకలికి
అతడు ప్రేమలా
అతడి లోపలి ఆశకు
ఆమె అండలా..

ఆమె ఎవరో అతడికి..
అతడు ఎందుకో ఆమెకి..
అంతా తెలిసి మెలిగే
ప్రేమది  ఎప్పుడూ  మౌనమే....

★★★

# బ్రతుకు

రామ్ డొక్కా

నీ ఆలోచనలు,
నీ ముందరి వాళ్ళ
సిద్ధాంతాలకు నకళ్ళు..

నీ రాగద్వేషాలు,
పరిస్థితుల నెపంతో
నీకు నీవుగా
వేసుకొంటున్న సంకెళ్ళు..

నీ బాధలు, కష్టాలు,
నీ ఎదలో నువ్వే
గ్రుచ్చుకొంటున్న ముళ్ళు..

నీ నడకలు,
ఇతరుల పాదముద్రల
ఆనవాళ్ళకు అనుసరణలు..

నీ పలుకులు,
నిన్నటి జ్ఞాపకాలకు
అనువాదాలు..

నీ జయాపజయాలు,
నిన్ను నువ్వు
సమాజపుటద్దంలో చూసి
సరిపోల్చుకొనే వెలుగునీడలు..
నీ గొంతు,
పరువు కోసం తెచ్చిపెట్టుకొన్న
అరువు బరువు..

నీ శ్వాస,
నిత్యం కచ్చితంగా
ఇచ్చిపుచ్చుకొనే చేబదులు..

నిజం చెప్పు!
నువ్వు నీ బ్రతుకునే
బ్రతుకుతున్నావా?

లేక,
నీ ఉనికినే
మరచిపోయి,

సృజనాత్మకతను
సృష్టివిలాసానికి
కుదువబట్టి,

క్షణక్షణం
కాల చక్రానికి
కప్పం కడుతూ,

స్వేచ్ఛను
యథేచ్ఛగా
విడచిపెట్టి,

నీ శరీరంలో
ఎందరెందరి జీవితాలనో
ఉచితంగా మోసేస్తున్నావా?

★★

# తలలో కుక్కుకున్న కోరికలు

శ్రీసాహితి

దండాలు పెట్టి పెట్టి
మంత్రాలతో పిలచి పిలచి
ఓ కల కోరినందుకు
వరమిచ్చినట్లే ఇచ్చి శాపాన్ని చూపావే...

కరుణించావనే నమ్మకం బతికుండగానే
అజ్ఞానపు ఆవేశంలో
కొత్త ఆలోచన వింత ప్రవర్తనలో
తలలో కుక్కుకున్న కోరికలు
గుండె వేగాన్ని పెంచి నిద్రను లాగేసుకుంటే
తమాషా చూస్తున్నావా?

నా భక్తికి నీ బాధ్యత లేదా?
నా పరువుకి నీ పూజలు దన్ను కాలేవా?
నా లోపలి బాధను పలుకరించలేవా?
నా లోతు ప్రశ్నకు జవాబు లేదా?

నెర్రెలుగా చీలిన ఆలోచనతో
ఒంటరితనంతో బీడుగా మారి
నాకు నేనే బరువుగా
నా అడుగులే శత్రువులే
దారులన్నీ ఉరిమి చూస్తున్నాయి

దూరం చూస్తే చాలా ఉంది
నీవు చూస్తే పరాయిలా ఉన్నావు
ఇప్పుడిక కోరికల కొలివి ఆరి,
భయం పొగ చుట్టేస్తుంది..

చేతల్ని మౌనం అల్లుకుని
ఒక్క నిజం ఆలస్యంగా పూచి,
రాత్రి పాఠాలు చెబుతుంటే
పగలు దిద్ది మార్కులు వేస్తుంది..!
వయసును చీల్చి
మనసు వెతికే తేలికైన సుఖం ముందు...
నా కోరికలు కాగితాల పూలే
నా ఊహలు మంచు బిందువులు -
కొత్త ఆలోచనల వింత ప్రవర్తనే
కొత్త చుట్టరికంలా కలుపుకు నడిచే
నిఘూల మధ్య నిజాలు ఎన్నో
గుప్పు గుప్పున సెగను చిమ్ముతూ -
నాకు మించిన ఏ ఖరీదైన సుఖమైనా
రేపటి శత్రువని
మనసుకి రుచి తగలని
ఏ బ్రతుకైనా వృధాయని
నన్ను తూచుకుని విలువ కనుగొనలేని
గుడ్డితనం శిక్షగా అనుభవం అంగీకరించి,

ఇక ఇది మొదలు
నిన్ను ఎప్పటికీ ఏదీ కోరను
ఏ కోరిక వైపుకు తొంగి చూడను..
మనసు ముడుచుకుని
నన్ను తెలుసుకుని మలుచుకుంటా
నిన్ను తలచుకుని నడచుకుంటా ...
ఏ కలతో రాత్రులకి దూరం కాను
ఏ కోరికతో బాధలను దగ్గర కాలేను...

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎఱకలను కట్టుకొని మింటికెగిరిపోదు
పుడమి సౌభాగ్యమెల్లను పొడగనంగ
అతులరమణీయతరమీ యిలాతలమ్ము
ఎంత చూచిన జూతునింకొంత వరకు

క్షేత్రములు సెలయేళ్ళు పచ్చిక బయళ్ళు
సాగు నదములు కదలాడు జలధి గతులు
అంబరమ్మును చుంబించునద్రితతులు
అరయనెచ్చోట క్ష్మాతలమబ్బురమ్ము

తలను పైకెత్తి చూతును తారకలను
తారకల నడుమ గ్రహసౌందర్యములను
చంద్రసూర్యుల ద్యోమార్గచలనములను
పుడమి యుడువీధి బెడగుల పొగడతరమె!

ఎవరు కారణకర్తలీ సృష్టికెల్ల
ఏ మహాశక్తి సృష్టికి హేతువయ్యె
ఎరుగజాలగ మార్గమ్ములేమి కలవు
మార్గమే లేక జ్ఞానసంపాదనెట్లు

శాస్త్రమార్గములెట్లైను సాధనములు
ఏ ప్రయోగశాలను సాధ్యమీ పరీక్ష
కలడు కలడనునాతడు కలడొ లేడొ
ఎచట లేడంచు చెప్పుటకేది ఋజువు

COMMENTS